[గల్పిక]

# క్లిష్ట సమస్య

కామయ్య పెదనాన్న చాలా ఖిన్నుడై కనిపించాడు.

"ఏం, పెదనాన్నా? ఎందుకట్లా చింతాక్రాంతుడివై ఉన్నావు?" అన్నాను.

"ఇంకేం చెప్పేదిరా? ఇద్దరు వెధవలూ చెప్పినమాట వినకుండా చెడిపోతున్నారు. నేను జీవించి ఉండగానే వీళ్లిట్లా ఎందుకూ కాకుండా పోతుంటే నేను కాస్తా హరీ అన్నమీదట వాళ్లకు పట్టపగ్గా లుంటాయా అని!" అన్నాడు పె.

"ఏం? ఏమంటా రేం?"

"ఏమంటారూ? దేవుడు లేట్ట, దెయ్యాల్లేవుట! కులాలూ మతాలూ లేవుట! అంతేమిటే?—వర్గాలు!—వర్గా లున్నవిట, దోపిడీవర్గాలుట, పీడితవర్గాలుట! నేను దోపిడీవర్గంట, వాళ్లు పీడితవర్గాలుట! ఇద్దరూ నే చెప్పినట్టు పెళ్లాడరుట. ఏ అడుక్కుతినేవాళ్లనో పెళ్లాడతారుట! విన్నావు గదూ? వాళ్లసలు నాతో మాట్లాడరు —"

"కమ్యూనిస్టుమతంగానీ పుచ్చుకున్నారేమో?" అన్నాను.

"ఏం పోద్దో?" అన్నాడు పె.

"డబ్బు లడిగితే ఇవ్వకు. రోగం వొదుల్తుంది," అన్నాను.

"వాళ్లు నన్నిప్పుడు డబ్బు లడగరుగా?

"ఇదో ట్రా? తిండికన్నా వస్తారా?"

"వస్తారు. వాళ్ళమ్మ కాళ్లా వేళ్లా పడితేగాని, తినరు."

"చాలా ముదిరింది. తిండిపెట్టటం మాని చూడు."

"వారంరోజులు అదీ చూశా! వాళ్లు ఎక్కడో తింటున్నారు. అందుకని మానేశా! ఏ శూద్రకూళ్లు తింటారో అని!"

"పోనీ, వా ళ్లిష్టమొచ్చినట్టు పోనీ. పెద్దవాడివి ఎంతకని ఇదవుతావు? చిన్న వెధవలా, చితకవెధవలా?"

"అదే కాదుట్రా, నా యేడుపూ? ఇద్దరికీ సంబంధా లొస్తున్నయ్. చెరో అయిదేసివేలన్నా కట్నం మిస్తారు కళ్ళకద్దుకు! వీళ్లు చూడబోతే కట్టైనా, కఠనా కాలర్రాయిరి."

పెదనాన్నకు పాపం పెద్ద చిక్కే వచ్చింది.

"ఇదంతా వీళ్లకు పుట్టిన బుద్ధి కాదు. వాడున్నాడే - ఆ పాపాలభైరవుడు - మా ఆఖరు బావమరిది ! వాడు పెడుతున్నాడు వీళ్లకీ బుద్ధులన్నీ. వాడు నాస్తికుడు. ఎప్పుడో జంధ్యం తెంచేసి దేవుళ్లేరన్నాడు. భాగం పంచుకోమని కూడా వాడే వీళ్లకు బోధిస్తూ ఉంటాడు."

"భాగాలు పంచమంటున్నారు కూడానా?"

"నే చెప్పే దేమిటే? భాగాలు పంచమనకపోతే వాళ్లను ఎట్లాగన్నా ఏడవనీ, నా కేం? వీళ్లకు భాగం పంచానే అనుకో ఏమవుతుంది? ఆ ఉన్నదికాస్తా అమ్మేసి బీదవాళ్లందరికీ పంచుతా మంటూరు. నే బతికుండగానే! నా కళ్ల ఎదటే!"

నేనేమీ మాట్లాడలేదు. ఏముంది మాట్లాడడానికి?

"నువ్వు రాజకీయాలు తెలిసినవాడివి. ఏదన్నా ఉపాయం చెబుదూ!" అన్నాడు పె.

"దేనికని చెప్పను? నీ సమస్య ఏమిటో నా కర్థం కావటంలేదు. దాని స్వరూపం క్షణక్షణానికీ మారుతున్నది," అన్నాను.

"నాకు మరేమీ అక్కర్లేదు. వాళ్లు మా బావమరిదిమాట వినకుండా ఉపాయం చెబుదూ!"

"చూడు, పెదనాన్నా! దీని కొక గొప్ప అంతర్జాతీయతన్నా ఉంది. అది ప్రయోగించి చూడు." అన్నాను.

"ఏమిట్రా అదీ?" అన్నాడు పె. ఆత్రంగా.

"నువ్వు నీ కొడుకుల్ని నీపక్షం చేసుకోవాలంటే మీ బావమరిది ఏయే ఉపదేశాలు చేస్తున్నాడో అవన్నీ నువ్వే చెయ్యి. మీ బావమరిది చెప్పే సిద్ధాంతాలను నువ్వే అమలుచేస్తానను. దేవుళ్లూ, దెయ్యాలూ లేవని ఒప్పుకో. కులాలు లేవని ఒప్పుకో. వా ళ్లిష్టమొచ్చినవాళ్లను పెళ్లాడనీ!"

పె. కాస్త అనుమానిస్తూ, "ఇందులో ఏమీ మోసం లేదుకద? అన్నాడు"

"లేదు. పెదనాన్నా! చాలా గొప్ప గొప్ప రాజకీయవేత్తలు బహిరంగంగా ఈ ఉపాయాన్ని అమలు చేస్తున్నారు" అన్నాను.

* * *

మా పెదనాన్న ఏం చేశాడో నాకైతే తెలీదు. ఇటీవలనే ఆయనకొడుకు లిద్దరూ చెరో "గ్రామిక" పిల్లనూ పెళ్లాడినట్టు తెలిసింది. నా విచారమల్లా, ఇంత గొప్ప అంతర్జాతీయయుక్తి పారకుండాపోయెనే అని.

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

## కులాసా కబుర్లు

(36-వ పేజీ తరువాయి)

నాయకుడు, రచయిత, మేధావి. అనేక వ్యాపకాలు ఉన్న ప్రతిభావంతుడు. షష్టిపూర్తి అయినా ఉత్సాహంలో యువకులలో యువకుడు. అలసిపోవటం అంటూ ఎరగడు, ప్రతిదీ చూడాలనే కుతూహలంలో పసిపిల్లవాడిలాంటివాడు. ఇవన్నీ అమెరికనుల దృష్టిలో అభిమానలక్షణాలుగా తయారైనవి.

ఇవి లోపించటంవల్ల ఆలీగారి విలేఖరుల కాన్ఫరెన్సు నెహ్రూగారి కాన్ఫరెన్సు మాదిరి కాకుండా పదిహేనునిమిషాలలో పూర్తి అయిందిట. విలేఖరులకు అడగటానికి ప్రశ్నలు తోచలేదుట. అయితే ఇందువల్ల ఆలీగారు చిన్నపుచ్చుకుని ఆ కోపమంతా మనవైపు రవాణా చేస్తాడని మనం అనుకో నక్కరలేదు. కాని ఒక్క విషయంమాత్రం నిక్కచ్చిగా చెప్పవచ్చు.

ఇన్నాళ్లూ పెట్టిన విసిరాట్లు విరోధులు స్నేహితులుగా మారినప్పుడు, కొంత చికాకు కలుగచేయక తప్పదు. ఏ రోజుకు ఎట్లా ఉంటుందో నని కాస్త పస్తాయిస్తే యీ సంకటం తప్పేది.